క్లుప్తంగా

ఆదివారం ఆటవిడుపు

చీరాల టౌన్: వాడరేవు సముద్ర తీరంలో సందడి నెలకొంది. ఆదివారం, దసరా సెలవులు కావడంతో చీరాల, పర్చూరు, అద్దంకి, పల్నాడు జిల్లాలోని నర్సరావుపేట, చిలకలూరిపేట నియోజకవర్గాలతో పాటు తెలంగాణ నుంచి పర్యాటకులు అధికసంఖ్యలో వాడరేవుకు చేరుకున్నారు. సముద్రపు మన్నుతో ఆడలాడుతుకుంటూ కేరింతలు కొడుతూ సముద్రంలో స్నానాలు ఆచరించారు. తీరం ఒడ్డున ఉన్న ఆంజనేయస్వామికి, గ్రామంలోని కోదండ రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రూరల్ ఎస్సై అంబటి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో సివిల్, మెరైన్ పోలీసులు గజ ఈతగాళ్లను సిద్ధం చేశారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం

సంతమాగులూరు(అద్దంకి): పుస్తక పఠనంతో విజ్ఞానం లభిస్తుందని గ్రంథపాలకుడు విజయ భాస్కర్‌రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక గ్రంథాలయంలో చదవడం మాకిష్టం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. పుస్తక పఠనం వలన కలిగే లాభాలు, ఏయే పుస్తకాలు చదవాలి, గ్రంథాయాన్ని ఎలా ఉపయోగించుకోవాలో తెలియజేశారు. గ్రంథాలయంలో పాఠ్య పుస్తకాలు కూడా లభిస్తాయని చెప్పారు.

1209 మందికి వైద్య పరీక్షలు

చీరాల టౌన్: వాడరేవు గ్రామంలోని రామానంద సరస్వతి ఆశ్రమంలో నిర్వహించిన ఉచిత మెగా షుగరు వ్యాధి శిబిరానికి విశేష స్పందన లభించింది. 1209 మందికి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. మేనేజర్ సురేష్ , కృష్ణారావు, శంకరరావు, కామేశ్వరరావు, గోపాల్, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

దొంగల ముఠా సంచారం

చీరాల అర్బన్: మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాలకు చెందిన ఆరుగురు సభ్యుల దొంగల ముఠా మండలంలో సంచరిస్తోందని చీరాల రూరల్ సీఐ శేషగిరిరావు, ఎస్సై చంద్రశేఖర్‌లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నెల్లూరు, కాకినాడ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లాలో పలు దొంగతనాలకు పాల్పడి బంగారం, నగదు దోచుకెళ్లారన్నారు. తాళాలు వేసిన ఇళ్ళనే టార్గెట్‌గా చేసుకుని చోరీలకు పాల్పడుతున్నారన్నారు.

అరకు కాఫీ ప్రాముఖ్యత పెంచుతాం

చీరాల అర్బన్: అరకు కాఫీ ప్రాముఖ్యత మరింత పెంచే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. ఆదివారం సాయంత్రం చీరాల రూరల్ మండలం వాడరేవులో అరకు కాఫీ షాపును ప్రారంభించి మాట్లాడారు. జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ ఎస్.లవన్న, ఆర్డీఓ చంద్రశేఖర్, చీరాల తహసీల్దార్ గోపీకృష్ణ, మున్సిపల్ చైర్మన్ మించాల సాంబశివరావు పాల్గొన్నారు.

దోమల జోరు.. జ్వరాల హోరు



విజయనగర్ కాలనీ గ్రామంలో అధ్వానంగా ఉన్న చెత్తకుప్పలు



గవినివారిపాలెం గ్రామంలో దోమలకు ఆవాసాలుగా మారిన నీటి నిల్వలు

- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- ఫాగింగ్ గురించి పట్టించుకొనేవారే లేరు

చీరాల టౌన్: మండలంలో దోమలు విజృంభిస్తున్నాయి. ఫలితంగా విష జ్వరాలు విపరీతంగా పెరిగిపోతున్నా పట్టించుకొనే వారే కానరావడం లేదు. 15 గ్రామ పంచాయతీలున్న చీరాల మండలంలో దోమలును నిర్మూలించే ఫాగింగ్ మిషన్లు ఉన్నప్పటికీ వాటిని వినియోగించకుండా అటకెక్కించారు. గ్రామాల్లో ఎక్కడ చూసినా పారిశుద్ధ్య లేమి వల్ల రోడ్లు, మురుగు నీరు దర్శనమిస్తున్నాయి. మురుగు నీటి కుంటల్లో పైరేత్రంను పిచికారీ చేయించడంలేదు. ఫలితంగా ప్రజలు రోగాల బారినపడి ఆసుపత్రుల్లో చేరుతున్నారు. మండలంలో 23991 నివాస గృహాలున్నాయి. మండల జనాభా 85,696 మంది ఉన్నారు. పారిశుద్ధ్య కార్మికులకు సక్రమంగా జీతాలు ఇవ్వకుండా, కనీసం బ్లీచింగ్ కూడా కొట్టకుండా కొందరు పంచాయితీ కార్యదర్శులు విడతల వారీగా డబ్బులు డ్రా చేసుకున్నారనే ప్రచారం జరుగుతోంది. కానీ ఆ నిధులను పారిశుద్ధ్య నిర్వహణకు ఖర్చు చేయడంలేదు. ఫాగింగ్ మిషన్లు కొనుగోలు చేసినప్పటికీ వాటిని మూలన పడేశారు. మురుగు కాల్వల్లో, చెత్తకుప్పల్లో దోమలు ఉత్పత్తి అయి జనాలపై దాడులు చేస్తున్నాయి. పంచాయతీలకు ప్రత్యేక అధికారులను కేటాయించడంతో వారీ వారి శాఖల పనులను చేస్తున్నారే కానీ కనీసం వారానికి ఒక్కసారి కూడా వారికి కేటాయించిన గ్రామాల్లో పర్యటించడంలేదు.

> **చర్యలు తీసుకుంటాం**
> మండలంలోని పంచాయతీలకు ఫాగింగ్ మిషన్లున్నాయి. ప్రతీ గ్రామంలో విధిగా వారానికి రెండు, మూడు సార్లు ఫాగింగ్ చేయవచ్చు. దోమల వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవచ్చు. గ్రామాలకు ఉన్న ఫాగింగ్ మిషన్లు విధిగా వాడేలా పంచాయతీల కార్యదర్శులకు ఆదేశాలిస్తా.
> – రామకృష్ణ, ఈవోఆర్డీ

సెక్యులర్, సోషలిజం పదాలు తొలగిస్తే ఉద్యమం

చీరాల రూరల్ : భారత రాజ్యాంగం పీఠికలోని సెక్యులరిజం, సోషలిజం అనేపదాలను తొలగించేందుకు బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లు కుట్రలు పన్నుతున్నాయని వాటిని తొలగిస్తే ఉద్యమిస్తామని ఆల్ ఇండియా బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాటి మార్క్ హెచ్చరించారు. ఆదివారం స్థానిక గడియార స్తంభం సెంటర్లోని కాన్షీరామ్ విగ్రహం వద్ద సెక్యులర్, సోషలిస్టు పదాలను రక్షించుకునే కార్యక్రమంలో నిర్వహించారు. అందులో భాగంగా అక్టోబర్ 9 కాన్షీరామ్ వర్ధంతి పురస్కరించుకుని విజయవాడలోని ధర్నాచౌక్ వద్ద జరిగే ధర్నాకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు కాటి మార్క్, దుడ్డు భాస్కరరావు, గొర్రెపాటి రవికుమార్‌లు మాట్లాడారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బహుజనులను దృష్టిలో ఉంచుకుని సెక్యులర్, సోషలిస్టు అనే పదాలను రాజ్యాంగంలో ఉదహరిస్తే బీజేపీ, ఆర్ఎస్ఎస్ వంటి సంస్థలు వాటిని తొలగించాలనే కుట్రలు పన్నుతున్నాయని చెప్పారు. కుంచాల పుల్లయ్య, డేవిడ్, లాజర్, వంశి, సుధాకర్, అరుణ్, అర్జున్‌రావు, బాబురావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న బీఎస్పీ నాయకులు

దేవుని పరిచర్యలో సేవా భారత్

చీరాల రూరల్: దేవుని సువార్త అందించి నశించిపోయే ఆత్మలను రక్షించడమే సేవా భారత్ లక్ష్యమని దైవ సువార్తికులు రెవరెండ్ కె. అనూప్ అన్నారు. ఆదివారం స్థానిక సెయింట్ మార్క్స్ సెంటినరీ లూథరన్ చర్చిలో సేవా భారత్ సండే నిర్వహించారు. ముందుగా సంఘ కాపరి రెవరెండ్స్ పిల్లి దేవదాసు, నానిబాబు, కిరణ్‌పాల్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. దేశ వ్యాప్తంగా సేవా భారత్ ఎంతో ప్రయాసతో కూడిన దేవుని వాక్య పరిచర్య చేస్తుందని చెప్పారు. అనేక రాష్ట్రాల్లో వాహన సదుపాయం కూడాలేని ప్రదేశాల్లో వందల కిలోమీటర్లు నడచి సువార్తను అందిస్తున్నట్లు చెప్పారు. ప్రభువైన ఏసుక్రీస్తు మనపై చూపిన ప్రేమ, జాలి, దయ, కరుణను మనం కూడా ఇతరులపై చూపాలని ఆయన తన వాక్య సందేశంలో పేర్కొన్నారు. చర్చి చైర్మన్ దేటా అశోక్‌కుమార్, ట్రెజరర్ పేర్లి ఆనంద్, పీసీసీ, ఎల్‌సీసీ, సంఘస్తులు పాల్గొన్నారు.



దేవుని వాక్య సందేశం అందిస్తున్న రెవరెండ్ అనూప్

మంచి వ్యాయామం, ఆహారంతో గుండె పదిలం

చీరాల అర్బన్: ఉదయం, సాయంత్రం వ్యాయామం చేయడం.. పోషక విలువలున్న ఆహారం తీసుకోవడం.. మానసిక ఒత్తిడిని తగ్గించుకుంటే గుండెను పదికాలాల పాటు పదిలంగా ఉంచుకోవచ్చని డాక్టర్లు సూచిస్తున్నారు. డయాబెటిక్‌ను అదుపులో ఉంచుకోవడం వలన గుండె బలహీన పడకుండా ఉంటుంది. ఊబకాయం, అధిక రక్తపోటు, ధూమపానం, మద్యపానం వలన కూడా గుండె జబ్బులు వచ్చే ప్రమాదం ఉంది. ప్రస్తుతం చీరాల పట్టణంలో గుండె సంబంధిత వైద్యసేవలు మెరుగ్గా ఉన్నాయి. గుంటూరు, విజయవాడ వెళ్ళనవసరం లేకుండా యాంజియోగ్రామ్, స్టంట్‌లను వేసే చికిత్స చీరాల్లోనే అందుబాటులో ఉన్నాయి.

రూ. 20 లక్షలతో గ్రామ ముఖ ద్వారం

అద్దంకి: సేవా కార్యక్రమాలను చేయడం కోసమే ఏఆర్ఎస్ సేవా సమితి ఏర్పాటు చేశామని సమితి కార్యకర్త నాగార్జునరెడ్డి అన్నారు. రూ.20 లక్షలతో జార్లపాలెం గ్రామ గుర్తింపు కోసం ముఖద్వారం నిర్మించినట్లు ఆదివారం చెప్పారు. 2 వేల మంది గ్రామస్తులకు అన్నదానం నిర్వహించారు. సమితికి మార్గదర్శకునిగా పనిచేస్తున్న ములకా కృష్ణారెడ్డికి అభినందనలు తెలియజేశారు.

వరుస ఘటనలపై స్పందించాలి

మార్టూరు: బాపట్ల జిల్లా మార్టూరు మండలం డేగరమూడి గ్రామంలో గత నెల రోజులుగా జరుగుతున్న వరుస ఘటనలపై కలెక్టర్, ఎస్పీ స్పందించి చర్యలు తీసుకోవాలని దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు నీలం నాగేందర్ రావు డిమాండ్ చేశారు. ఆదివారం డేగరమూడి గ్రామంలో పర్యటించారు. దళిత యువకులు పోతులూరి, ప్రమోద్ కుమార్లను పరామర్శించి.. మార్టూరు సీఐ శేషగిరిరావుపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యదర్శి శ్రీనివాసరావుపై చర్యలు తీసుకోవాలన్నారు. కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చినగంజాం పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన డీఎస్పీ

చినగంజాం: చీరాల డీఎస్పీ మొయిన్ ఆదివారం చినగంజాం పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. పోలీస్ స్టేషన్‌లోని రికార్డులను, సిబ్బంది హాజరును, పనితీరు పరిశీలించారు. ఎస్ఐ ఎస్. రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

జగన్ ఇచ్చే భరోసానే డిజిటల్ బుక్



డిజిటల్ బుక్‌ను నాయకులతో కలిసి ఆవిష్కరిస్తున్న సమన్వకర్త అశోక్ కుమార్

అద్దంకి: అన్యాయం జరిగిన కార్యకర్తలు, నాయకులకు జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చే భరోసానే డిజిటల్ బుక్ అని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త డాక్టర్ చింతలపూడి అశోక్ కుమార్ అన్నారు. ఆదివారం నియోజకవర్గ స్థాయి నాయకులు, వివిధ హోదాల్లో ఉన్న నేతలతో కలిసి పిడుగురాళ్లలో ఆదివారం డిజిటల్ బుక్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అశోక కుమార్ మాట్లాడుతూ ఎవరికీ పదవులు శాశ్వతం కావని, ఎవరు బాగా పాలించారు.. ప్రజలు ఎంత బాగా ఉన్నారనే ముఖ్యం అన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో అన్యాయపు పాలన నడుస్తోందని, కక్షపూరితంగా వైఎస్సార్ సీపీ నాయకులు కార్యకర్తలపై కేసులు నమోదు చేసి ఇబ్బందులు పెట్టిన సందర్భాలు ఎన్నో ఉన్నాయన్నారు. కూటమి ప్రభుత్వ పాలనతో అక్రమ కేసులు ఎదుర్కొని అన్యాయానానికి గురైన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు వారికి జరిగిన అన్యాయాలను డిజిటల్ బుక్‌లో పొందుపరచాలని కోరారు.

4న అద్దంకికి..

అద్దంకి నియోజకవర్గ సమన్వయకర్తగా ఈ నెల తన పుట్టిన రోజు సందర్భంగా అద్దంకి రానున్నట్లు అశోక్‌కుమార్ చెప్పారు. అయితే అద్దంకి రానుంది జగన్‌మోహన్ రెడ్డి, ఫ్యాన్ గుర్తుగా భావించి కుంటుంబ భావించాలని చెప్పారు. పార్టీకి అండదండగా నిలిచే అందిరికీ భరోసా ఇస్తానని చెప్పారు. అందరి ధ్యేయం అద్దంకిలో ఈ సారి వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేయడమేనని చెప్పారు. ప్రతి కార్యకర్త, నాయకుడు విభేదాలు వీడి సమష్టి కృషితో పార్టీ పురోభివృద్ధికి విజాయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గ, మండల, జిల్లా, రాష్ట్ర హోదాల్లో ఉన్న నాయకలుతో పాటు, గ్రామ స్థాయి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కూటమి అరాచకాలు అడ్డుకునేందుకే డిజిటల్ బుక్

- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి, నియోజక వర్గ ఇన్‌చార్జ్ గాదె మధుసూదన రెడ్డి
- నాయకులు, కార్యకర్తలపై దాడులకు పాల్పడిన వారిపై చట్టప్రకారం చర్యలు



డిజిటల్ బుక్ ఆవిష్కరణ సమావేశంలో మాట్లాడుతున్న గాదె



డిజిటల్ బుక్‌ను ఆవిష్కరిస్తున్న ఇన్‌చార్జ్ గాదె, పర్చూరు నాయకులు

పర్చూరు(చినగంజాం): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం సాగిస్తున్న అరాచకాలను అడ్డుకునేందుకు పార్టీ కార్యకర్తలను సంరక్షించేందుకు డిజిటల్ బుక్ విధానాన్ని వైఎస్ జగన్మోహనరెడ్డి ఆచరణలోకి తీసుకువచ్చారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి, పర్చూరు నియోజక వర్గ ఇన్‌చార్జ్ గాదె మధుసూదనరెడ్డి అన్నారు. రాష్ట్రంలో అన్యాయానికి గురవుతున్న పార్టీ కార్యకర్తల కోసం రూపొందించిన డిజిటల్ బుక్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని పర్చూరు పార్టీ కార్యాలయంలో ఆదివారం ఇన్‌చార్జ్ గాదె మధుసూదనరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచకం పెరిగిపోయిందని.. పార్టీ కార్యకర్తలపై విచక్షణా రహితంగా దాడులు పెరిగి పోయాయన్నారు. అలాంటి వాటి నుంచి కార్యకర్తలకు రక్షణ కల్పించేందుకు జగన్ మంచి ఆలోచన చేసి డిజిటల్ బుక్‌ను తయారు చేశారన్నారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై చేసే అరాచకాలు, కూటమి ప్రభుత్వ అండతో అధికారులు చేసే దౌర్జన్యాలు, ఇబ్బందికర పరిస్థితులు, వారి ప్రవర్తనా తీరును నమోదు చేసుకోవడం ద్వారా అనంతరం న్యాయం చేసే వీలుంటుందన్నారు. డిజిటల్ బుక్‌లో కార్యకర్తలు అన్యాయం ఏమిటీ? ఎవరి వల్ల జరిగింది? వారి పేరు.. ఒక వేళ అధికారి అయితే వారి పేరు నమోదు చేయాలన్నారు. దీనివల్ల 2029లో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత వారికి న్యాయం జరిపించేందుకు అవకాశం కలుగుతుందన్నారు.

కూటమి రాజకీయం సెపరేటు

గత 50 సంవత్సరాలుగా రాష్ట్రంలో జరుగుతున్న రాజకీయం, ప్రస్తుత కూటమి ప్రభుత్వ హయాంలో జరుగుతున్న తీరు సపరేటుగా ఉందని గాదె అన్నారు. అధికారంలోకి వచ్చిన పార్టీలు రాష్ట్రంలో పాలనా విధానంపై దృష్టి పెట్టి అభివృద్ధి సాధించే దిశగా అడుగులు వేయాల్సింది పోయి ప్రతిపక్ష పార్టీ నాయకులు, కార్యకర్తలపై దృష్టి పెట్టి వారిని ఇబ్బందులకు గురి చేయడం అన్యాయమన్నారు. వారి ఆర్థిక మూలాలను దెబ్బతీయండం వంటి చర్యలతో వేధించే పనిలో కూటమి ప్రభుత్వం నిమగ్నమైందని ఆయన విమర్శించారు. ప్రతిపక్ష పార్టీ కార్యకర్తలను ప్రశాంతంగా బతకనిచ్చే పరిస్థితి లేదన్నారు. ప్రస్తుతం అధికారంలో లేని కారణంగా రాష్ట్రంలో జరుగుతున్న అరాచక సంఘటనలకు ఎటువంటి చర్యలు తీసుకోలేని పరిస్థితి అని, అయితే అధికారంలోకి రాగానే వాటిని పరిష్కరించుకునేందుకు వీలుంటుందన్నారు. రెండు మూడు నెలల్లో స్థానిక సంస్థల ఎన్నికల రాబోతున్న దృష్ట్యా కూటమి ప్రభుత్వం అరాచకాలకు పాల్పడే అవకాశం ఉందని, నాయకులు, కార్యకర్తలు గతంలో జరిగిన విభేధాలు పక్కన బెట్టి కలిసి మెలిసి ఉంటూ పార్టీ గెలుపు కోసం కృషి చేయాలన్నారు.

పార్టీ కోసం పనిచేసే వారికి సముచిత స్థానం

నియోజక వర్గంలో పార్టీ కోసం పనిచేసే వారికి సముచిత స్థానం కల్పిస్తారని గాదె స్పష్టం చేశారు. పార్టీ అభివృద్ధికోసం పనిచేసే వారిని గుర్తించి గ్రామ స్థాయి, మండల స్థాయి, నియోజక వర్గ స్థాయి, జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయి పార్టీ పదవులు భర్తీ చేస్తామని రాబోయే 10-15 రోజుల్లో పూర్తి చేసి పార్టీని బలోపేతం చేసేందుకు సత్వర చర్యలు తీసుకుంటానన్నారు. పర్చూరు నియోజక వర్గంలో పార్టీని గెలిపించేందుకు తన శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని, నియోజక వర్గంలో పార్టీ ఎందుకు విజయం సాధించదో చూస్తానన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు కఠారి అప్పారావు, చిన్ని పూర్ణారావు, జంపని వీరయ్య చౌదరి, పంచాయతీ రాజ్ జిల్లా అధ్యక్షుడు తోకల కృష్ణమోహన్, జిల్లా అధికార ప్రతినిధి బండారు ప్రభాకరరావు, బీసీ సెల్ అధ్యక్షుడు కొమ్మనబోయిన వాసు, రాష్ట్ర సోషల్ మీడియా అధ్యక్షుడు బట్టు అనిల్ కుమార్, నియోజక వర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు నూతలపాటి బలరాం, ఐటీ విభాగం అధ్యక్షుడు గర్నెపూడి రవిచంద్, సోషల్ మీడియా అధ్యక్షులు కుమ్మరి చందు, రాష్ట్ర విద్యార్థి విభాగం కార్యదర్శి మాచవరపు రవికుమార్, కాటి లక్ష్మణ్, ఎర్రం సుబ్బారెడ్డి, కేవీ సుబ్బారావు చౌదరి, మువ్వల రాంబాబు, ప్రచార విభాగం అధ్యక్షుడు దాసరి వెంకటరావు, కంచనపల్లి రమేష్, కొల్లా శ్రీహరి, యద్దనపూడి హరి ప్రసాద్, మల్లా శ్రీను, ద్రోణాదుల సర్పంచ్ వంకాయలపాటి భాగ్యారావు, గొల్లపూడి సర్పంచ్ రామకృష్ణ, గాదె సురేష్ పాల్గొన్నారు.

ఆధునిక పద్యకవి గుర్రం జాషువా

చీరాల రూరల్: దేశ చరిత్రలో తొలి ఆధునిక దళిత పద్యకవి గుర్రం జాషువా అని తన కవిత్వం ద్వారా సామాజిక రుగ్మతలపై అంటరానితనంపై సామాజిక దురాచాలపై గళమెత్తారని పలువులు వక్తలు పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని విజయనగర్‌కాలనీలో గుర్రం జాషువా 130వ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మున్నంగి నాగరాజు, బీఎస్పీ నాయకుడు సిర్రా భగత్‌సింగ్, దుడ్డు భాస్కరరావు మాట్లాడారు. పిరదౌసి, గబ్బిలం, క్రీస్తు చరిత్ర, కాందిశీకుడు వంటి రచనల ద్వారా సమాజంలోని తారతమ్యాలు, వివక్షవంటి వాటిని గూర్చి తెలుసుకోవటానికి ఎంతగానో ఉపకరించాయని చెప్పారు. జాషువాకు పద్మభూషణ్, కేంద్ర సాహిత్య అకాడమి అవార్డులు ఇచ్చి సత్కరించాయని చెప్పారు. బుడంగుంట్ల లక్ష్మినరసయ్య, గొర్రెపాటి వందనం, దుడ్డు భాస్కరరావు, గొర్రెపాటి రవికుమార్ పాల్గొన్నారు.

అద్దంకి: నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా అని రిటైర్డ్ అర్జేడీ యు. దేవపాలన అన్నారు. పసుమర్తిపాలెంలోని జాషువా విగ్రహం వద్ద ఆదివారం రాత్రి జాషువా జయంతి నిర్వహించారు. జవ్వి రాము, విగ్రహ ప్రదాత తాళ్లూరి బాబూరావు, మన్నం త్రిమూర్తులు, చప్పిడి వీరయ్య, జ్యోతి రమేశ్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

అద్దంకి: సమాజ శ్రేయస్సుకు జాషువా కవిత్వం ఎంతగానో ఉపయోగపడిందని సాహితీవేత్త అనీల కుమార సూరి అన్నారు. ఆదివారం స్థానిక కమఠేశ్వర స్వామి ఆలయంలో సృజనసాహిత్య వేదిక ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. సీతారామశాస్త్రి నిర్వహించిన భస్మాసుర ఏకపత్రాభినయం ఆహుతులను ఆకట్టుకుంది. రిటైర్డు అర్జేడీ ఉబ్బా దేవపాలన, యనమంద్ర వరలక్ష్మి, పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి పాల్గొన్నారు.

మేదరమెట్ల: గుర్రం జాషువా 138వ జయంతి వేడుకలను స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. మోంద్రు ఆంజనేయులు, బి.దశరథ, వై.రవి, యోహాన్, జి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సోషల్ మీడియాలో ప్రాధాన్యత ఇవ్వండి



పర్చూరు సోషల్ మీడియా వారియర్స్‌తో ఇన్‌చార్జ్ గాదె మధుసూదన రెడ్డి

పర్చూరు(చినగంజాం): సోషల్ మీడియాలో వ్యక్తిగత దూషణలు చేయకుండా పార్టీ కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇవ్వాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి, పర్చూరు నియోజక వర్గ ఇన్‌చార్జ్ గాదెమధుసూదన రెడ్డి అన్నారు. పర్చూరు పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా సమావేశం ఆదివారం ఇన్‌చార్జ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యక్తిగత దూషణలు జోలికి పోకుండా పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్ళాలని, కూటమి ప్రభుత్వ అక్రమాలు, అన్యాయాలు గురించి ప్రజలకు ఎప్పటికప్పుడు తెలియజేయాలని సూచించారు. సోషల్ మీడియా కార్యకర్తలపై అక్రమంగా బనాయిస్తున్న కేసులు చట్టం ద్వారా ఎదుర్కొంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో నియోజక వర్గ సోషల్ మీడియా కన్వీనర్ కుమ్మరి చందు, రాష్ట్ర సోషల్ మీడియా సంయుక్త కార్యదర్శి బట్టు అనిల్ కుమార్, సోషల్ మీడియా వారియర్స్ పాల్గొన్నారు.